# హోంగార్డ్ పోస్టులకు నోటిఫికేషన్

- సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో 1,800 ఖాళీలు

సాక్షి, హైదరాబాద్: సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లలో 1,800 హోంగార్డు పోస్టుల భర్తీకి శుక్రవారం నోటిఫికేషన్ వెలువడింది. ఒక్కో కమిషనరేట్‌లో 900 చొప్పున ఉన్న పోస్టులకు ఆయా కమిషనరేట్ల పరిధిలో నివసించే స్థానికులు మాత్రమే అర్హులని కమిషనర్లు సందీప్ శాండిల్య, మహేష్ ఎం.భగవత్ స్పష్టం చేశారు. శనివారం నుంచి ఈ నెల 25 వరకు(పని దినాల్లో మాత్రమే) దరఖాస్తులు విక్రయించనున్నారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నివసించే అభ్యర్థులకు గచ్చిబౌలిలోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో, రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో నివసించే అభ్యర్థులు అంబర్‌పేటలోని రాచకొండ సీఏఆర్ హెడ్-క్వార్టర్స్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య రూ.25 చెల్లించి దరఖాస్తులు పొందవచ్చు. అక్కడే అధికారులు అభ్యర్థుల వివరాలను నమోదు చేసుకుంటారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్సు ప్రతులు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో రావాల్సి ఉంటుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి. జనరల్ విధుల్ని 'ఎ' కేటగిరీలో, డ్రైవర్, కంప్యూటర్ ఆపరేటర్, సీసీ కెమెరా టెక్నీషియన్, కుక్, శానిటేషన్/మెయింటెనెన్స్ స్టాఫ్, స్వీపర్, ధోబీ, బార్బర్, ప్లంబర్, పెయింటర్, ఆటో ఎలక్ట్రీషియన్, ఆటో మెకానిక్ తదితర పోస్టుల్ని 'బీ' కేటగిరీలో చేర్చారు. 'ఏ కేటగిరీ'కి దరఖాస్తు చేయడానికి పదో తరగతి, 'బీ కేటగిరీ' పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పురుష అభ్యర్థులు కనీసం 165 సెంటీమీటర్ల ఎత్తు(ఎస్టీలు 160 సెంమీ), మహిళా అభ్యర్థులు 150 సెంటీమీటర్ల ఎత్తు(ఎస్టీలు 145 సెంమీ) కలిగి ఉండాలి. నిర్దేశిత పోస్టులకు సంబంధించిన వృత్తివిద్యా సర్టిఫికెట్లు సైతం జత చెయ్యాలి. ఆయా పోస్టులకు అప్లై చేసే అభ్యర్థులు దరఖాస్తుతో పాటు బర్త్ సర్టిఫికెట్, నేటివిటీ సర్టిఫికెట్, ఐటీఐ ట్రేడ్ సర్టిఫికెట్ (ఉన్నట్లైతే), 2014 సెప్టెంబర్ 30కి ముందు జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్, విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డ్ ప్రతుల్ని జత చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల ఫిట్‌నెస్, పూర్వాపరాల పరిశీలన తర్వాత ఎంపిక జరుగుతుంది. ఎంపికైన వారికి రోజుకు రూ.400 చొప్పున వేతనం చెల్లిస్తారు.

**ఒక్కో కమిషనరేట్‌లో ఉన్న ఖాళీల వివరాలు..**

| | |
|---|---|
| జనరల్ విధులు | : 500 |
| డీజీ రిజర్వ్ | : 225 |
| డ్రైవర్(ఎల్ఎంవీ) | : 100 |
| కంప్యూటర్ ఆపరేటర్ | : 20 |
| సీసీ కెమెరా టెక్నీషియన్ | : 20 |
| కుక్ | : 8 |
| శానిటేషన్/మెయింటెనెన్స్ స్టాఫ్ | : 5 |
| స్వీపర్ | : 5 |
| ధోబీ | : 2 |
| బార్బర్ | : 3 |
| ప్లంబర్ | : 2 |
| పెయింటర్ | : 3 |
| ఆటో ఎలక్ట్రీషియన్ | : 2 |
| ఆటో మెకానిక్ | : 5 |
| మొత్తం | : 900 |